# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## మోటర్లు కాలిపోతుండే..

ఉట్నూర్ రూరల్, నవంబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వంలో లో ఓల్టేజీ సమస్యతో లెక్కలేనన్ని మోటర్లు కాలిపోయి ఖర్చు తడిసి మోపడయ్యేవి. ఒక్కో మోటర్ కాలిపోతే రిపేర్ చేయించడానికి రూ.3 వేల నుంచి రూ.5 వేలు అయ్యేవి. ఏడు గంటలు అన్నరు కానీ.. ఏనాడు కరెంటు సక్రమంగా ఇచ్చింది లేదు. పంటలు వట్టిపోతుంటే కరెంటు కోసం రాత్రిళ్లు మోటర్ల దగ్గర పండుకొని కాపలా కాసినం. సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఉచితంగా ఇస్తున్నడు. ఇలాంటి ప్రభుత్వాన్ని వదులుకోం. కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే మళ్లీ పాత కథే వస్తది. కేసీఆర్ ఆదుకున్నడు అందుకే అండగా ఉంటా.

**- అమ్రు నాయక్, రైతు, ఉట్నూర్ మండలం.**

## మూడు గంటలెట్ల సాల్తది..



తాంసి, నవంబర్ 27 : రేవంత్‌రెడ్డి.. ఎవుసానికి మూడు గంటల కరెంటు సాలంటున్నడు. అదీ ఏ మూలకు సరిపోతది. గిదీ కూడా తెల్వనోళ్లు ఏం పాలన చేస్తరు. ఆయనకు ఎవుసం చేస్తేనేమో తెలుస్తుండే. దుక్కి దున్నడం, కోత కోయ్యడం తెలుసా? సీఎం కేసీఆర్ సారు 24 గంటలు ఉచితంగా ఇస్తుంటే.. రెండు పంటలు పండిస్తున్నం. నాకు ఏడెకరాల భూమి ఉన్నది. మిర్చి, శనగ, పత్తి వేస్తా. 24 గంటల ఉచిత కరెంటుతో ఏ రందీ లేకుండా పంట పండిస్తున్నా. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు మూడు గంటల కరెంటు ఇస్తే.. ఒక్క ఎకరం కూడా పారడం కష్టమే. మరి మిగతా ఆరెకరాలు ఎండుడేనా? నాదంటే పక్కన బెట్టు.. పదెకరాలు ఉన్న రైతు పరిస్థితి ఏందీ? మూడు గంటలకు మూడెకరాలు కూడా తడ్వది. మాట్లాడితే దిమాకుండాలె. ఇగ, 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలె అంటంద్రు. ఆ మోటర్లకు వైర్లు, పైపులు ఇలా అన్ని మార్చాల్సి వస్తది. ఎంత లేదనుకున్న రూ. ఒక లక్షకుపైగా అవుతాయి. ఈ పైలసెవరు భరిస్తరు. కాంగ్రెస్ వచ్చేది లేదు. సచ్చేది లేదు.. మాటలు తప్పా.

**- చింతలపెల్లి లస్మన్న, రైతు, రుయ్యాడి, తలమడుగు మండలం.**



## కాంగ్రెసోళ్లను నమ్మం..

బోథ్, నవంబర్ 27 : నిరంతర కరెంట్ ఉంటేనే చేలకు నీళ్లు అందుతయ్. ఇప్పుడిస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో రెండు పంటలు పండించుకుంటున్నం. కాంగ్రెస్ వాళ్లు అధికారంలోకి వస్తే మూడు గంటలు ఇస్తామంటున్నరు. అంటే మళ్లీ పాత రోజులు వస్తయి. అప్పట్లో కరెంట్ ఎప్పుడు వచ్చేదో.. ఎప్పుడు పోయేదో తెలియకుండే. వానకాలంలో పత్తి, యాసంగిలో శనగ, జొన్న, విత్తనోత్పత్తికి జొన్న వేసుకుంటం. కరెంట్ బాగా ఉండడంతో వాటికి అవసరమైన సమయంలో నీటి తడులు ఇచ్చుకుని మంచి దిగుబడులు సాధిస్తున్నాం. ఇప్పుడు మోటర్లు కాలకుండా, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోకుండా నాణ్యమైన కరెంట్ వస్తున్నది. రైతులకు మంచి చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే రైతుల మద్దతు ఉంటది. కాంగ్రెసోళ్లను రైతులు నమ్మే పరిస్థితిలో లేరు. **- జక్క అభిరెడ్డి, రైతు, ధన్నూర్ (బీ)**



## 10 హెచ్‌పీ మోటర్లతో భారమే..

ఉట్నూర్ రూరల్, నవంబర్ 27 : రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెడితే కరెంటు ఎక్కువ కాలడంతోపాటు ఖర్చు కూడా ఎక్కువైతది. మోటరు ధర కూడా రూ. లక్ష వరకు ఉంటుంది. ఏదైన కారణంతో కాలిపోతే రిపేర్ చేయడానికే రూ.6 వేల వరకు ఖర్చవుతాయి. ఇప్పటి వరకు నా దగ్గరికి ఒక్క రైతు కూడా 10 హెచ్‌పీ మోటరు తీసుకరాలేదు. ఈ మోటర్లు వాడితే బాయిలో నీరు సరిపడా ఉండకుంటే కాలిపోయే ప్రమాదం ఉంది. రైతులకు 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ సరిపోతాయి.

**- ఆలీ, మోటర్ వైండిగ్ మెకానిక్, ఉట్నూర్ మండలం**

# 'టెన్'షన్

- 10 హెచ్‌పీ మోటర్లతో ఆర్థిక భారమే..
- కాంగ్రెసోళ్ల తీరుపై అన్నదాతల ఆగ్రహం



**'24 గంటల కరెంటుతోటి మంచిగా రెండు పంటలు పండించుకుంటా హాయిగా ఉన్నాం. కాంగ్రెసోళ్లు అధికారంలో ఉన్నప్పుడు పడ్డ కష్టాలు చాలు. మళ్లీ ఇప్పుడు ఎలక్షన్లు రాంగనే కాంగ్రెసోళ్లు ఏదేదో మాట్లాడుతున్నారు. రేవంత్‌రెడ్డికి పిచ్చిపట్టినట్టుంది. మూడు గంటల కరెంటు సరిపోతదని అంటున్నాడు. మూడు గంటల కరెంటు తోటి తడిసిన మడే తడుస్తుంది. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటడు. గీ మోటర్లు పెట్టుడంటే ఉట్టిగనే అయితదా? లక్ష రూపాయలు దాకా కావాలె. అయినా 10 హెచ్‌పీ మోటరు పెడితే ఒక్క దెబ్బ కు నీళ్లను గుంజేత్తది. మోటర్లన్నీ ఒక్కటేసరి నడిసేసరికి ఉన్నయన్నీ కాలిపోతయ్. ఎవుసం గురించి ఏం తెల్వనోళ్లు కూడా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నరు. ఎవరికి ఎలా బుద్ధి చెప్పాలో మాకు బాగా తెలుసు..' అని రైతులు స్పష్టం చేస్తున్నారు.**



## పది హెచ్‌పీ మోటర్లంట.. ఇది అయ్యే పనేనా?

ఇచ్చోడ, నవంబర్ 27 : కాంగ్రెస్ పార్టీ వాళ్లకు వ్యవసాయంపై కనీస అవగాహన లేదు. రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంట ఇది అయ్యే పనేనా. అసలు పది హెచ్‌పీ మోటర్లు పెడితే భూ గర్భజలాలు ఉంటయా. వ్యవసాయం, రైతులపై అవగాహన లేని వాళ్లకు పాలన అప్పగిస్తే మా పని అయిపోయినట్లే. 10 హెచ్‌పీ మోటర్లతో రెండు, మూడు గంటల్లోనే పొలాన్ని తడపొచ్చని అంటున్నరు. ఇది సాధ్యం కాదు. వ్యవ్యసాయ బోర్లకు కేవలం మూడు, ఐదు హెచ్‌పీ మోటర్లనే బిగించుకుంటరు. పది హెచ్‌పీ మోటర్లతో నీటిని గుంజితే ఒక్కసారిగా బోర్లలో నీళ్లు ఇంకిపోయే ప్రమాదం ఉంది. పైపుల్ పగిలి పోవచ్చు. పది హెచ్‌పీ మోటర్ మార్కెట్‌లో రూ.70 వేల నుంచి రూ. ఒక లక్ష వరకు ఉంటది. ఇది రైతులకు సాధ్యమయ్యే పనికాదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మాకు మళ్లీ కష్టాలు తప్పవు. గతంలో తెచ్చుకోలేం. అధికారం కోసం కాంగ్రెసోళ్లు ఏది పడితే అది మాట్లాడుతున్నరు. ఆ మాటలు వింటుంటే నవ్వొస్తుంది. ఒక్కసారి అధికారం ఇవ్వండని అడుగుతున్నారు. మరి పదకొండు సార్లు ఏం చేసింద్రు. అలా అడగడానికి సిగ్గు ఉండాలి. మేము మళ్లీ మోసపోవడానికి సిద్ధంగా లేం. కచ్చితంగా కారు గుర్తుకు ఓటేసి, వేయించి కేసీఆర్‌కు అండగా ఉంటం.

**- సాయిని స్వామి, రైతు, సిరికొండ మండలం**



## పదేండ్ల కిందట ఎంతో గోసపడ్డం..

తాంసి, నవంబర్ 27 : నాకు నాలుగెకరాల పొలం ఉన్నది. గతంల రాత్రి, పగలు తేడా లేకుండా ఇంటి నుంచి పొలానికి పరుగులు పెట్టేవాడిని. రాత్రిపూట విష పురుగులతో కష్టమయ్యేది. కరెంటు ఎప్పుడస్తదో తెలియక పొలం వద్దే ఉండేవాళ్లం. నీళ్లు అందక పంటలు పండక బతకడానికి చాలా కష్టంగా ఉండే. కాంగ్రెస్ వస్తే కరెంటుకు తిప్పలైతది. పది హెచ్‌పీ మోటర్లు వాడితే ఒక్కసారికి నీళ్లను గుంజేస్తది. మళ్లీ పొలాలు ఎండుతాయి. కాంగ్రెసోళ్ల మాటలు ఎవరూ నమ్మరు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీకి రైతుల సపోర్టు ఉంటది.

**- ఎల్మల అనిల్, రైతు, జామిడి, తాంసి మండలం**



## రైతుల పాపం తగులుద్ది..

సొనాల, నవంబర్ 27 : కాంగ్రెస్ హయాంలో కరెంటు లేక, పంటలకు నీరు లేక వ్యవసాయం దండగైంది. ఎవుసం అంటేనే భయపడి.. బతుకు దెరువు కోసం రైతులు వలసలు వెళ్లారు. 24 గంటల కరెంటుతో రెండు పంటలకు సరిపడా నీళ్లు వస్తున్నాయి. కాంగ్రెస్ కాలంలో ఎవుసం ఎవడు చేస్తడు అనే పరిస్థితి నుండి ఎవుసం చేయలిరా ఆనే పరిస్థితికి వచ్చినం. రైతులంతా తలెత్తుకుని తిరిగెలా సీఎం కేసీఆర్ చేసిండు. సంతోషంగా ఉన్న రైతులకు కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంటు చాలు, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని నోటికోచ్చినట్లు మాట్లాడుతుంద్రు. కాంగ్రెసోళ్లకు పోయేకాలం దగ్గర పడ్డది. రైతు కన్నీరు మంచిది కాదు. కచ్చితంగా శాపం తగులుతది. **- ఇర్ల శరత్, యువరైతు, సొనాల మండలం.**